## క్లుప్తంగా

### ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, సచివాలయ సిబ్బంది

**డుంబ్రిగుడ:** మండలంలోని అరకు వారపు సంతలో శుక్రవారం ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా సంతలో గిరిజనులకు ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు డిసెంబర్ 1వ తేదీ నుంచి పాలిథిన్ కవర్లు వాడకంపై నిషేధం విధించినట్టు చెప్పారు. వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. పంచాయతీ సెక్రటరీ వల్లిబాయ్, సచివాలయం సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**పాడేరు రూరల్:** ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి లవరాజు తెలిపారు. పాడేరు వారపు సంతలో ఎంపీడీవో డేవిడ్‌తో ఆయన శుక్రవారం పర్యటించారు. వ్యాపారులకు పాలిథిన్ కవర్లు వినియోగించొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలతో పాటు రూ.500 నుంచి రూ.1000 వరకు జరిమానా విధిస్తామన్నారు, ఈవోఆర్డీ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వరి కోతలను వాయిదా వేసుకోవాలి



రేవళ్లులో ఏవో ఉమాదేవితో కలిసి రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

**కొయ్యూరు:** మండలంలోని రేవళ్ల పంచాయతీలో వరి పొలాలను ఎంపీపీ బడుగు రమేష్, వ్యవసాయ అధికారి ఉమాదేవి పర్యటించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలను పరిశీలించారు. తుపాను నేపథ్యంలో వరి రైతులు కోతలను వాయిదా వేసుకోవాలన్నారు, కోత కోసిన తరువాత వర్షం కురిస్తే తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు కోతలను వాయిదా వేసుకోవాలని కోరారు. కల్లాల్లో ఉన్న వరి కుప్పలపై టార్పాలిన్లు వేసుకొని రక్షించుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది రూప, ఉషా తదితరులు పాల్గొన్నారు.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి



జెడ్పీటీసీ కిముడు శివరత్నం

**గూడెంకొత్తవీధి:** తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని గిరిజన రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం అన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అకాల వర్షాల కారణంగా మండలంలోని కొన్ని గ్రామాలు అతలాకుతలమైన విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ప్రధానంగా రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. పంటలు నీట మునగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొండ దిగువన ఉన్న గ్రామాల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే అధికారిక యంత్రాంగానికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

### పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న డీఎల్‌పీవో రాఘవన్, ఎంపీడీవో రామకృష్ణ

**గంగవరం:** మండలంలోని టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో డీఎల్‌పీవో రాఘవన్, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి పరిసరాల్లో చెత్తా చెదారాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. హెచ్‌ఎం బి.నాగేశ్వరరావు, పంచాయతీ కారదర్శి అజయ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బిక్కు బిక్కుమంటూ..

- శిథిలావస్థలో పశు వైద్యశాల
- భయం భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- రికార్డులు, మందులు భద్రపరిచేందుకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



పాడైన కిటికీ బీటలు వారిన గోడ



శిథిలావస్థలో ముంచంగిపుట్టు పశు వైద్యశాల భవనం

**ముంచమంగిపుట్టు:** మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పశు వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం గోడలు బీటలు వారి తలుపులు, కిటికీలు ఊడిపోతున్నాయి. భవనంపై కప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో పశు వైద్య సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో రికార్డులు, మందులు భద్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు పశు వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనే విధులు నిర్వహిస్తున్నారు. పశు వైద్య శాల భవనం నిర్మించి 40 ఏళ్లు పైగా అవుతున్నా నేటి వరకు మరమ్మతు చేయకపోవడంతో భవన పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. భవనంలో ఉన్న నాలుగు గదుల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.ఈ భవనం నిర్మించేటప్పుడు పిల్లర్స్‌తో నిర్మించకపోవడంతో ప్రస్తుతం గోడలు, శ్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

**చెదలు పట్టిన కిటికీలు, తలుపులు**

పశు వైద్యశాలలో గదులకు ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలకు చెదులుపట్టి చాలా వరకు పాడైపోయాయి. కొన్ని కిటికీల తలుపులు వేసే పరిస్థితి లేదు. కిటికీల తలుపులు వేసేందుకు ప్రయత్నం చేస్తే ఊడిపోతున్నాయి. దీంతో అప్పుడప్పుడు విష సర్పాలు పశు వైద్యశాలలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో సిబ్బంది భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడేటప్పుడూ పలు చోట్ల నీరు కారుతుండడంతో విధులకు సైతం ఆటంకం కలుగుతుందని సిబ్బంది చెబుతున్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు పెదగూడ పశు వైద్యశాల భవనం సైతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీనికి తోడు కిలగాడ, జోలాపుట్టు, దొడిపుట్టు పశు వైద్యశాలలకు ఎటువంటి భవనాలు లేకపోవడంతో పరాయిపంచన పశు వైద్యశాలలు నిర్వహణ జరుగుతూ వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్యశాలలకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, భవనాలు నిర్మించి పశు వైద్యశాలలకు భవనాల సమస్యలను తీర్చాల్సిన స్థానికులు కోరుతున్నారు.



పెచ్చులూడిన భవనం శ్లాబ్

**ఉన్నతాధికారులకు నివేదించాం**



పశు వైద్యశాల శిథిలావస్థలో ఉంది. కిటికీలు, తలుపులు పాడైయ్యాయి. భవనం పైకప్పు నుంచి పెచ్చులు పడుతున్నాయి. అప్పడప్పుడు విష సర్పాలు గదుల్లోకి వస్తున్నాయి. మందులు నిల్వకు ఇబ్బందిగా ఉంది.భవన పరిస్థితిని ఉన్నత అధికారులకు తెలియజేశాం.

– ఎం.సౌజన్యదేవి, పశువైద్యాధికారి, ముంచంగిపుట్టు

## ఘనంగా కార్తీక వన సమారాధన

**రాజవొమ్మంగి:** మండలంలోని అప్పలరాజుపేట వనాల్లో శుక్రవారం జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో పోస్టల్ శాఖ ఈడీ ఉద్యోగులు సందడి చేశారు. స్థానిక సబ్ పోస్ట్‌మాస్టర్ అజయ్‌కుమార్ నేతృత్వంలో మండల వ్యాప్తంగా గల సుమారు 40 మంది బ్రాంచ్ పోస్టుమాస్టార్లు, ఇతర ఈడీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత వృక్షాలకు పసుపు కుంకుమలు అద్ది దీప దూప నైవేద్యాలతో పూజలు చేశారు. అనంతరం వంటలు వండుకొని ఉసిరి చెట్టు కింద సహపంక్తి భోజనాలు చేశారు. సెల్ఫీలు తీసుకొంటూ, ఆటపాటలతో సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.



అప్పలరాజుపేటలో కార్తీక వన భోజనాల్లో పోస్టల్ ఈడీ ఉద్యోగులు

పోస్టల్ అసిస్టెంట్ ప్రభాకర్, సిబ్బంది సీతారామరాజు, సుబ్బరాజు, అప్పారావు, అప్పలకొండ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

**రాజవొమ్మంగి:** మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కిశోరి వికాసంపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థినులు బాగా చదుకొని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా సంఘాల ద్వారా గ్రామాల్లో సైబర్ క్రైం,



మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

ఆన్‌లైన్ మోసాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తామన్నారు. తహసీల్దార్ అల్లు సత్యన్నారాయణ, సీడీపీవో దేవమణి, ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఎంఈఓ సూరయ్యరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణలత తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల మరణాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం


**అరకులోయటౌన్:** అరకులోయ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతూ మృతి చెందిన జన్ని ప్రియాంక(11) కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ప్రభుత్వమే చెల్లించాలని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యుడు సమరెడ్డి మాణిక్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏజెన్సీలో విద్యార్థులు మృత్యువాత పడుతున్నా కూటమి ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని, నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. గృహాల్లో వర్కర్లు అరకొరగా ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకపోవడంతో తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ప్రతి నెల బిల్లుల్లో 25 శాతం లంచాలను ఉన్నతాధికారులు తీసుకుంటున్నారని, దీన్ని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గురుకుల బాలికల పాఠశాలలో మృతి చెందిన ప్రియాంక సంఘటనపై ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దండకారణ్య ఉద్యోగ సమితి మాజీ ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, డీఎల్‌ఓ జిల్లా అధ్యక్షుడు కాంతరావు, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

## సీపీఎం నేతల విరాళాల సేకరణ

**పాడేరు రూరల్(అరకులోయ రూరల్):** జిల్లా కేంద్రం పాడేరులో డిసెంబర్ 4,5 తేదీల్లో నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర చెప్పారు. పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న మహాసభలకు సంబంధించి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ 1/70, పీసా చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఏజెన్సీలో గిరిజనులు పండించే కాఫీ, మొక్కజొన్న, పసుపు తదితర పంటలకు విక్రయాలు, మార్కెటింగ్ కల్పనకు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసి, గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గిరిజన నిరుద్యోగుల కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై తమ పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు విరాళాలు ఇచ్చిన మహాసభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శ్రీనివాసరావు, చిన్నయ్యపడాల్, సుందర్‌రావు, లక్కు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

**ముంచంగిపుట్టు:** మండలంలో గల మాకవరం పంచాయతీ కేంద్రంలో సీపీఎం నాయకులు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో నిప్పు అంటుకొని వరి పంట కాలిపోయి నష్టపోయిన బాధిత రైతులను కలిసి సంఘటనపై ఆరా తీసి, వివరాలు సేకరించారు. అనంతరం అక్కడకు వచ్చిన తహసీల్దార్ నర్సమ్మతో సీపీఎం నేతలు మాట్లాడి వరి పంట దగ్ధమవడంతో నష్టపోయిన 11 మంది రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు కోరారు. దీనికి స్పందించిన తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ ఘటనపై



మాకవరంలో బాధిత రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సమ్మ, సీపీఎం నేతలు

రైతులతో మాట్లాడి నష్టంపై నివేదికను తయారు చేసి, ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వో లక్ష్మీ, సీపీఎం నేత శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

**జి.మాడుగుల:** పాడేరు వైపు వెళ్తున్న కారు బందవీధి గ్రామ సమీపంలోని మలుపు వద్ద అదుపు తప్పి ప్రమాదానికి గురైన ఘటనలో డ్రైవర్ గాయాలైనట్టు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన పర్యాటకులు కారులో శుక్రవారం జి.మాడుగుల వచ్చి పాడేరు వెళ్తుండగా,బందవీధి సమీపంలోని మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. కారులో డ్రైవర్‌కు గాయాలకు కాగా మిగిలిన నలుగురి సురక్షితంగా ఉన్నట్టు తెలిసింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.



ప్రమాదానికి గురైన కారు

## ఆత్మీయ సన్మానం



డీఈఈ రాజును సన్మానిస్తున్న సిబ్బంది

**చింతపల్లి:** చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డి.ఆర్.హెచ్. రాజును శుక్రవారం డీఈఈ కరుణ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి పరిష్కారానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా పథకాలు ఏర్పాటుకు కృషి చేసిన డీఈఈగా రాజు సేవలను కొనియాడారు. ఏఈఈ కళ్యాణ్‌రామ్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాసశివరాత్రి



శివాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

**సీలేరు:** కార్తీక మాసం పురస్కరించుకొని సీలేరు శివాలయంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బోరు నిర్మాణ పనులు ప్రారంభం


**జి.మాడుగుల:** మండలంలో వంతాల పంచాయతీ కేంద్రంలో శుక్రవారం జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన బోరు నిర్మాణ పనులను ఎంపీపీ కళ్యాణి ప్రారంభించారు. బోరు నిర్మాణంతో ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. వైస్ సర్పంచ్ తిరుపతమ్మ, వార్డు సంబర్లు చిన్న జయసుధ, మాజీ సర్పంచ్ కొండబాబు, గ్రామ పెద్దలు కృష్ణమూర్తి, చిన్నారావు, రమేష్, వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

**డుంబ్రిగుడ:** మండలంలోని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తూ బరిలో ఉన్న ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి కోరేట్ల విజయ గౌరీ మండలంలోని కించుమండ, డుంబ్రిగుడ, కిల్లోగుడ, అరకు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయు సమస్యలపై విస్తృతంగా పోరాటం చేస్తున్నామన్నారు. మహేశ్వరరావు, కన్నయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'గిరిజనులకు సేవలందించడం అదృష్టం'

**కొయ్యూరు:** డౌనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న తగ్గి వరప్రసాద్‌కు పోస్టు గ్రాడ్యువేషన్(పీజీ)లో సీటు వచ్చింది .ఇటీవల రాసిన పీజీ అర్హత పరీక్షలో ఆయన గైనకాలజీ విభాగానికి ఎంపికయ్యారు. గుంటూరు వైద్య కళాశాలలో అతనికి సీటు వచ్చింది.



డాక్టర్ వరప్రసాద్

ఈ సందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బంది అతనిని అభినందించారు.ఆయన మూడు సంవత్సరాల కిందట డౌనూరు వైద్యునిగా బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లి మండలం బందబయలకు చెందిన వరప్రసాద్ ఎంబీబీఎస్‌ను రాజమండ్రిలో మెడిసెన్ కోర్సు పూర్తి చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజనులకు సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నారన్నారు. సేవ చేయాలన్న లక్ష్యంతో వైద్య వృత్తిని ఎన్నుకున్నామన్నారు. పీజీలో సీటు రావడం ఆనందంగా ఉందన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



అరకులోయ కళాశాలలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధ్యాపకులు



వాలీబాల్ విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్‌నాయక్, అధ్యాపకులు



రంపచోడవరంలో ముగ్గులు పోటీలను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

**అరకులోయటౌన్:** ఎయిడ్స్ డే (డిసెంబర్ 1న) పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 1వ తేదీ ఎయిడ్స్‌డే పురష్కారించుకొని రంగోలిపోటీలు, మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.పుష్పరాజ్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఆర్‌సీ కమిటీ సభ్యులు సుందరి రాణి, డాక్టర్ కొండబాబు ఎన్ఎస్ఎస్ పీవోలు వై.వి జయలక్ష్మీ, మొష్కా అనిత కుమారి, లచ్చన్న దొర, విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల 26, 27వ తేదీల్లో భీమిలిలో జరిగిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల టీం సెలక్షన్ ట్రయల్స్‌లో వాలీబాల్ పోటీలో అరకులోయల కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని తృతీయ స్థానం సాధించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భరత్ కుమార్ నాయక్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి పసుపులేటి నాగబాబు, పీడీ ఎస్.అప్పారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

**రంపచోడవరం:** రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ ఎయిడ్స్ డేలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విభాగ పర్యవేక్షణలో విద్యార్థులకు వక్తృత్వ, రంగోలి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సుమారు 50మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా సీనియర్ అధ్యాపకులు చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ కేజీ వెంకటేష్‌లు వ్యవహరించారు.

## స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

**హుకుంపేట:** మండలంలోని తీగలవలస పంచాయతీ బిజ్జపల్లిలో జాయ్ మినిస్ట్రీస్ ఆఫ్ ది గాస్పెల్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ సభ్యుడు కొర్రా నాగరాజు ముఖ్య అతథిగా పాల్గొని మాట్లాడుతూ కుట్టు శిక్షణ పొంది స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్న జాయ్ మినిస్ట్రీస్ ఆఫ్ ది గాస్పెల్ సంస్థ సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో గిరిజనులకు అన్ని విధాలుగా ప్రోత్సహించాలని సంస్థ ప్రతినిధులను వారు కోరారు. జాయ్ మినిస్ట్రీస్ ఆఫ్ ది గాస్పెల్ డైరెక్టర్ డాక్టర్ టి.అలెగ్జాండర్, సిబ్బంది డాక్టర్ బి.అనిల్‌కుమార్, కే.జాన్‌వెస్లీ, స్థానిక దైవ సేవకులు మర్రి మత్యరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ బేసు, ఎంపీటీసీ నాగరాజు, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ అలెగ్జాండర్ తదితరులు

## గృహాల మంజూరుకు వినతి

**డుంబ్రిగుడ:** అర్హులైన ప్రతి ఒక్క పీవీటీజీలకు ప్రధానమంత్రి జన్‌మన్ పక్కా గృహాలు మంజూరు చేయాలని డుంబ్రిగుడ హౌసింగ్ ఏఈ నాగేశ్వరరావుకు శుక్రవారం సీపీఎం నాయకులు సురేష్‌కుమార్, సత్యనారాయణలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పక్కా గృహాలు మంజూరు కానీ చాలామంది పీవీటీజీ లబ్ధిదారులున్నారని, అర్హులందరికీ మంజూరు చేయాలని కోరారు. ఈ పథకంలో మొదటి విడతలో కొర్రాయి పంచాయతీ కొత్తవలస గ్రామంలో కొంతమందికి గృహాలు మంజూరు కాలేదని వారు వివరించారు. పక్కా గృహాల నిర్మాణం కోసం పీవీటీజీలకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఏఈ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## పీఆర్ కమిషనర్ దృష్టికి ఏజెన్సీ సమస్యలు

**రంపచోడవరం:** ఏజెన్సీలోని సమస్యలు పరిష్కరించాలని పీఆర్ ఆర్డీ కమిషనర్ కృష్ణతేజను విజయవాడలో రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి కోరారు. విజయవాడలో పీఆర్ ఆర్డీ కమిషనర్‌తో జరిగిన సమావేశంలో ఏజెన్సీ ప్రాంత సమస్యలను వివరించారు. మన్యంలో శిథిలావస్థలో ఉన్న ఎంపీపీ కార్యాలయాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని కోరారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి గ్రామాల్లోని రహదారుల నిర్మాణాలకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎంపీపీలకు ఎంపీడీవోతో జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని కోరారు. మండల స్థాయిలో సివిల్ సప్లయి విజిలెన్స్ కమిటీ , ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, ఎలక్ట్రికల్ విజిలెన్స్ కమిటీ సమావేశాలు తరుచూ జరిపేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాలకు నిధుల విడుదల చేస్తే అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.



పీఆర్ కమిషనర్ కృష్ణతేజతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

## ఆకట్టుకున్న అంబేడ్కర్ జీవితాశయ నాటిక

**సీలేరు:** రాజ్యాంగకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సీలేరు కల్యాణమండపంలో శుక్రవారం అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ బృందం ఆధ్వర్యంలో 'సంఘం శరణం గచ్ఛామి' పేరుతో నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం నవభారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ లక్ష్యాలను ప్రజలకు చాటి చెప్పేలా నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాటిక ప్రాజెక్టు డైరెక్టర్ జగ్గరాజు, టీం లీడర్ ప్రశాంత్ విలేకర్లతో మాట్లాడుతూ ఈ నాటకాన్ని తెలుగు, హిందీ బాషల్లో ఇప్పటివరకు 73 ప్రదర్శనలు ఇచ్చినట్టు చెప్పారు. సీలేరు సీఐటీయూ నాయకులు, ఏపీజెన్‌కో ఇంజనీర్ల, కాంట్రాక్టు కార్మికులు సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ నాటకు ప్రదర్శనకు విశేష స్పందన వచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఏపీజెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్ తదితరులు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ నాయకుడు రాంబాబు, రమణ, సుభాన్, ఏపీజెన్‌కో ఇంజినీర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నాటకంలో ఒక దృశ్యం